సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం । 12 । నవంబర్ । 2024



పత్తి కొనుగోళ్లు షురూ..

ప్రభుత్వం రంగంలోకి దిగి సీసీఐ ఉన్నతాధికారులు, కాటన్ అసోసియేషన్ నాయకులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి.

- 8లో▸



ప్రసవాల సంఖ్య పెంచాలి

ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.5^0 / 21.2^0

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: 108 వాహనాల్లో పైలెట్ ఉద్యోగాల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 13న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నేరుగా దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు 10వ తరగతి పూర్తి చేసి హెవీ ట్రాన్స్‌పోర్ట్ బ్యాడ్జి నంబర్ కలిగి ఉండాలన్నారు. 22నుంచి 30 ఏళ్లలోపు వారై ఉండాలని సూచించారు. ఉద్యోగ నియామకం తరువాత రాష్ట్రంలో ఏ జిల్లాలోనైనా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

భూపాలపల్లి అర్బన్: ఆగి ఉన్న లారీని ఓ కారు ఢీ కొట్టిన ఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాది కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన ఐదుగురు వ్యక్తులు కారులో మంచిర్యాలకు పెళ్లికి వెళ్లి వస్తున్నారు. పట్టణ శివారులోని బాంబులగడ్డ సమీపంలో పార్కు చేసి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొన్నారు. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా.. మరో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియరాలేదు.

డీఎఫ్‌ఓగా నవీన్‌రెడ్డి



భూపాలపల్లి: జిల్లా అటవీశాఖ అధికారిగా ఐఎఫ్‌ఎస్ అధికారి మందాడి నవీన్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. నవీన్‌రెడ్డి జోగులాంబ గద్వాల్ జిల్లా అటవీశాఖ అధికారిగా పని చేస్తున్నారు. ప్రస్తుతం డీఎఫ్‌ఓగా పనిచేస్తున్న జె.వసంతను హైదరాబాద్‌లోని నెహ్రూ జువాలజికల్ పార్క్ క్యూరేటర్‌గా నియమించారు. నవీన్‌రెడ్డి నేడు లేదా రేపు డీఎఫ్‌ఓగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

క్షుద్రపూజల కలకలం



కాటారం: మండలంలోని సుబ్బయ్యపల్లి గ్రామశివారులో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి క్షుద్రపూజలకు పాల్పడిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. ప్రధాన రహదారి పక్కన కుంకుమ, పసుపు, నిమ్మకాయలు పెట్టి ఓ బొమ్మను తయారు చేసి ఉంచారు. దీంతో అటువైపుగా వెళ్లినవారు గమనించి స్థానికులకు తెలపడంతో క్షుద్రపూజల విషయం ఊరంతా పాకింది. గ్రామస్తులు అటువైపుగా వెళ్లడానికి జంకుతున్నారు.

ఐదుగురి బైండోవర్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కుదురుపల్లి వాగు వద్ద క్షుద్ర పూజలు చేయించుకున్న ఐదుగురు వ్యక్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు మహదేవపూర్ ఎస్సై కె.పవన్ కుమార్ తెలిపారు. పూజ చేసిన వ్యక్తి పరారీలో ఉన్నట్లు చెప్పారు. క్షుద్ర పూజలను నమ్మవద్దని అన్నారు.

ప్రాజెక్టును పరిశీలించిన డ్యామ్ సేఫ్టీ బృందం



మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి బొగ్గులవాగు ప్రాజెక్టును సోమవారం డ్యామ్ సేఫ్టీ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీతో పాటు రాష్ట్ర సాంకేతిక ఇంజనీరింగ్ నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత్తడి, తూము, కరకట్టను పరిశీలించారు. ప్రాజెక్టు సమస్యలను గుర్తించి, నివేదిక తయారు చేశారు. సదరు నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. దీనిద్వారా ప్రాజెక్టు మరమ్మతులకు అవసరమయ్యే నిధులను విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలి పారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఆర్‌పీ సభ్యులు చైర్మన్, డ్యామ్ సేఫ్టీ ఎక్స్‌ఫర్ట్‌పేటీ పాండ్యా, రిటైర్డ్ సీడబ్ల్యూపీఆర్‌సీ డ్యామ్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్ విజయ్ ట్రీమ్‌బంక్, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, ఐ అండ్ సీఏడీ హైడ్రాలిక్ డిపార్ట్ మెంట్ పి.రామ్‌రాజు, రిటైర్డ్ డైరెక్టర్ జనరల్, జీఎస్ఐ జీయాలజిస్ట్ రాజు, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ, రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ సభ్యులు చీఫ్ ఇంజనీర్ (ఓఅండ్ఎం), క్యూసీ, ఎస్‌డీఎస్‌ఓ, నాగేందర్‌రావు, చీఫ్ ఇంజనీర్ టి.ప్రమీల, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ సంధ్యారాణి, కృష్ణకుమార్, ఇరిగేషన్ సీఈ సుధాకర్ రెడ్డి, ఈఈ యాదగిరి, డీఈ సతీష్, ఏఈఈలు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరు



భూగర్భ గనుల్లోనే..

సర్ఫేస్, కార్పొరేట్ ఏరియాలతోపాటు ఓపెన్‌కాస్ట్, అండర్ గ్రౌండ్ మైన్లు అన్నింటా విధులకు గైర్హాజరు అవుతున్న కార్మికుల సంఖ్య అధికంగా ఉంటోంది. భూగర్భ గనుల్లో పనిచేసే కార్మికుల సంఖ్య అత్యధికంగా ఉంటోంది. ఇప్పటికే సంస్థ పరిధిలో ఉన్న భూగర్భ గనులన్నీ తీవ్ర నష్టాల్లో ఉన్నాయి. ఓపెన్ కాస్ట్ మైన్లతో పోల్చితే భూగర్భ గనుల్లో ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో కార్మికుల గైర్హాజరుతో ఈ నష్టాలు మరింతగా పెరుగుతున్నాయి. తరచుగా విధులకు హాజరుకాని కార్మికులతో పని చేయించేందుకు నూతన విధానాలు, పద్ధతులేవి సంస్థలో అమలుకావడం లేదు.

సింగరేణిలో తరచూ ఇదే పరిస్థితి

- భూగర్భ గనుల్లో పనిచేసేందుకు కార్మికుల విముఖత
- నియామకాల్లో జాగ్రత్తలు తీసుకోని యాజమాన్యం

భూపాలపల్లి అర్బన్: సింగరేణి సంస్థలో పలువురు కార్మికులు తరచూ విధులకు గైర్హాజరవుతున్నారు. దీంతో బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడుతోంది. కార్మికులందరూ విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంలో యాజమాన్యం కూడా విఫలమవుతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల గనుల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించి విధులకు హాజరయ్యేలా చర్యలు ప్రారంభించారు.

సింగరేణి సంస్థ ఆరు జిల్లాల పరిధిలో 12 ఏరియాల్లో విస్తరించి ఉంది. సంస్థ పరిధిలో 41,013 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. వీరంతా 24 భూగర్భ, 18 ఓపెన్ కాస్ట్ గనులతోపాటు కార్పొరేట్, వర్క్‌షాప్, సివిల్ తదితర విభాగాల్లో పనులు చేస్తున్నారు. కార్మికుల్లో సుమారు 1,900 మంది కార్మికులు తరచూ విధులకు గైర్హాజరవుతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు సంస్థ పరంగా తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా ఉంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. సంస్థ ఏడాదిలో దాదాపు 365 రోజులు బొగ్గు ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకోసం పండగలు, వారాంతపు సెలవు రోజుల్లో పనిచేసే వారికి డబుల్ మస్టర్లు ఇస్తుంది. ఇలాంటివి వద్దనుకుంటే కనీసం మూడు వందల రోజులు పని దినాలుగా ఉంటాయి. ఏడాదంతా కలిపినా కనీసం వంద రోజులు కూడా పని చేయడానికి ఇష్టపడని కార్మికుల సంఖ్య సింగరేణిలో నాలుగు శాతంగా ఉంది.

పొంతనలేక..

కారుణ్య నియామకాల ద్వారా వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించిన తర్వాత 12వేల మంది సంస్థలో నియమితులయ్యారు. ఇలా సంస్థలో చేరుతున్న వారికి పాత పద్ధతిలోనే భూగర్భ గనుల్లో పనులు కేటాయించడం వల్ల గైర్హాజరు శాతం ఎక్కువగా ఉంటోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ మేరకు సంస్థ అవసరాలు కారుణ్య నియామకాల ద్వారా సంస్థలో చేరే ఉద్యోగుల విషయంలో వారి విద్యార్హతలు ఆసక్తులకు మధ్య పొంతన ఉండేలా సరికొత్త విధానం అమల్లోకి తీసుకురావాలనే డిమాండ్ వస్తోంది. దీంతో పాటు భూగర్భ గనుల్లో మ్యాన్‌రైడింగ్ యంత్రాలను ఏర్పాటు చేయడంలోనూ జాప్యాన్ని నివారించాల్సిన అవసరం ఉంది.



ఇటీవల ఏరియాలోని 6వ గనిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ఆర్థిక సంవత్సరంలో 75 మస్టర్లు కూడా చేయని కార్మికులు

ఏరియా	ఉద్యోగుల సంఖ్య
కొత్తగూడెం	18
మణుగూరు	597
ఇల్లందు	302
రామగుండం-1	275
రామగుండం-2	108
రామగుండం-3	126
భూపాలపల్లి	262
బెల్లంపల్లి	9
మందమర్రి	79
శ్రీరాంపూర్	114

కారణాలు ఇలా..

గడిచిన ఎనిమిదేళ్లగా నోటిఫికేషన్ల కంటే మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియ ద్వారానే ఎక్కువ మంది సింగరేణిలో ఉద్యోగులుగా చేరారు. ఇలా ఉద్యోగాలు పొందుతున్న వారిలో 90శాతం మంది భూగర్భ గనుల్లోనే పనిచేయాల్సి ఉంటుంది. వీరు కనీసం 190 మస్టర్లు చేసిన తర్వాతే సర్ఫేస్‌కు అర్హత పొందుతారు.. లేదా ఇంటర్నల్ పరీక్షలు రాయడం ద్వారా పదోన్నతి పొందే అవకాశం ఉంది. అప్పటివరకు భూగర్భ గనుల్లో కఠినమైన ప్రదేశాల్లో పనులు చేయాల్సి ఉంటుంది. గతంతో పోల్చితే ఇప్పుడు మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా ఉద్యోగాలు పొందుతున్న వారిలో దాదాపు అందరూ కనీసం విద్యావంతులే ఉంటున్నారు. ఐటీఐ వంటి వృత్తివిద్యతో పాటు ఇంజనీరింగ్, ఎంబీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సులు చేసిన వారు కారుణ్య నియామకాల ద్వారా సంస్థలో ఉద్యోగం పొందుతున్నారు. తమ విద్యార్హతలకు గనిలో చేసే పనికి పొంతన లేకపోవడంతో ఎక్కువమంది విధులకు హాజరయ్యేందుకు మొగ్గు చూపడం లేదు.

విధుల్లోకి రప్పించడమే ధ్యేయం..



భూపాలపల్లి ఏరియాలో గడిచిన తొమ్మిది మాసాల్లో కనీసం 75 మస్టర్లు చేయని కార్మికులను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చాం. కానీ కొంత మందిలోనే మార్పు వచ్చింది, దీంతో మిగతా వారికి కుటుంబాలతో సహా జీఎం కార్యాలయాల్లో కౌన్సెలింగ్ ఇవ్వాలని నిర్ణయించాం. ఉద్యోగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నందున విధులకు రప్పించాలనేదే మా ధ్యేయం.

- రాజేశ్వర్‌రెడ్డి, ఏరియా జీఎం

ఉసిరిచెట్టు వద్ద లక్ష వత్తులు వెలిగిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు సతీమణి గండ్ర పద్మ, మహిళా భక్తులు



భక్తజన సందడి

- కాళేశ్వరాలయంలో కిక్కిరిసిన భక్తులు
- రూ.5.10 లక్షల ఆదాయం

కాళేశ్వరం: కార్తీకమాసం సోమవారం ఏకాదశిని పురస్కరించుకొని కాళేశ్వరాలయంలో భక్తులు కిక్కిరిశారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. గోదావరిలో సైకిత లింగాలు చేసి పూజించారు. గోదావరిమాతకు పసుపు, కుంకుమ, సారెను సమర్పించారు. దొప్పలలో దీపాలు వదిలారు. అనంతరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి గర్భగుడిలో ద్విలింగాలకు అభిషేక పూజలు, అర్చనలు చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు, శ్రీసరస్వతీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉసిరి చెట్టు వద్ద మహిళలు ప్రదక్షిణలు చేసి లక్షవత్తులు వెలిగించి లక్ష ముగ్గులు వేశారు. దీపారాధన చేశారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. ప్రకార దేవతలకు మొక్కులు చెల్లించారు. సుమారుగా 30వేలకు పైగా భక్తజనం దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. రూ. 5.10 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ మారుతి తెలిపారు.



సామూహిక సత్యనారాయణవ్రతం..

కోటగుళ్లలో 'కార్తీక' పూజలు



కోటగుళ్లలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గణపురం: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండలకేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం కోటగుళ్లలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్తీక సోమవారం కావడంతో ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గణపేశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించడంతో పాటు దీపారాధన చేశారు. భూపాలపల్లి డీఎస్పీ అవిరినేని సంపత్‌రావు, విజయ దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి రాజబోయిన సునీత శ్రీశైలం దంపతులు పూజల్లో పాల్గొన్నారు.



అభిషేకం చేస్తున్న డీఎస్పీ సంపత్ రావు దంపతులు

ధాన్యం కొనుగోలుకు సిద్ధం

- మారుమూల గ్రామాల్లో టెలికం సేవలు అందాలి
- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి కొనుగోలుకు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఐడీఓసీ కార్యాలయంలో రెవెన్యూ, పౌర సరఫరాలు, పౌర సరఫరాల సంస్థ, సహకార శాఖల అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పీఏసీఎస్, ఐకేపీకి కేటాయించిన అన్ని సెంటర్లను ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాములు, జిల్లా సహకార అధికారి వాలియానాయక్, ఆర్డీఓ మంగీలాల్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఆజాద్ జయంతి..

భారతరత్న పురస్కార గ్రహీత, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను జిల్లా బీసీ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాల్‌లో ఘనంగా నిర్వహించా రు. ఈ వేడుకల్లో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వారు... మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, బీసీ సంక్షేమ అధికారి శైలజ, జిల్లా అధికారులు, మైనార్టీ సంఘ నాయకులు పాల్గొన్నారు.



టెలికం సేవలపై మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ, సంపర్

టెలికం సేవలు అందించాలి..

మారుమూల గ్రామాలకు టెలికం సేవలు అందేలా చూడాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. టెలికమ్యూనికేషన్ సేవలపై బీఎస్ఎన్ఎల్, టీ ఫైబర్, ఎయిర్‌టెల్, జియో సంస్థల అధికారులతో సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయా సంస్థల సేవల గురించి కలెక్టర్, టెలి కమ్యూనికేషన్ జాయింట్ కంట్రోలర్ సీఎం సంపర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సీపీఓ బాబురావు, వివిధ నెట్‌వర్క్ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి..

ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు కలెక్టర్ స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రీవెన్స్‌లో మొత్తం 57 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ మంగీలాల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సమగ్ర సర్వే

సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్

మల్హర్: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సమగ్ర కుటుంబ సర్వేపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సర్వే అనంతరం డాటా ఎంట్రీకి కావాల్సిన కంప్యూటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్ల వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్యూమరేటర్ల ద్వారా కుటుంబ వివరాల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అవినాష్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్యామ్‌సుందర్, ఎంపీఎస్‌ఓ శివకృష్ణ, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీరామమూర్తి, సీఆర్పీ సబిత పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్

జిల్లా రోల్‌మోడల్‌గా ఉండాలి

- అభివృద్ధిలో అగ్రగామిగా నిలవాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

భూపాలపల్లి రూరల్: అభివృద్ధిలో జిల్లా అగ్రగామిగా నిలిచి దేశానికి రోల్‌మోడల్‌గా ఉండాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. యాస్పిరేషన్ లక్ష్యాల సాధనపై విద్యా, వైద్య, సంక్షేమ, వ్యవసాయ శాఖల అధికారులతో సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, అనంతరం విలేకరులతో మంత్రి బండి సంజయ్ మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఏం అవసరమో అధికారులకు అవగాహన ఉండాలన్నారు. ప్రతి గర్భిణి ఆరోగ్యంగా ఉండాలని.. ఆరోగ్యవంతమైన బిడ్డ జన్మిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు. జిల్లాలో యాస్పిరేషన్ పారామీటర్లు 95శాతంపైగా నమోదు చేస్తున్నారని అభినందించారు. చిన్నారులకు చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు గణపురం మండలం చెల్పూర్‌లో మిల్లెట్ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. భూసార పరీక్షలు నిర్వహిస్తూ పంటల సాగుపై రైతులకు సూచనలు అందించాలని తెలిపారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలు ఉండే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. పారామీటర్ల లక్ష్య సాధనలో కలెక్టర్ రాహుల్ శర్మను ప్రత్యేకంగా అభినందించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు జిల్లాను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ఇండికేటర్లు నూరు శాతం సాధించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 30 ఏళ్ల పైబడిన వాళ్లందరికీ మధుమేహ, బీపీ పరీక్షలు నిర్వహిస్తూ ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపడతున్నట్లు తెలిపారు. అంతకుమందు కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులతో కలిసి మంత్రి సంజయ్‌కు పూల మొక్కతో ఆహ్వానించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల సత్యపాల్‌రెడ్డి, నాయకులు వెన్నంపల్లి పాపయ్య, యుగేందర్, రాంచంద్రారెడ్డి, దొంగల రాజేందర్, మధుసూదన్‌రెడ్డి, కంబాల రాజయ్య, నర్సింహమూర్తి, తదితర జిల్లా, మండలాల నాయకులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి బండి సంజయ్‌కుమార్, అధికారులు

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

కాటారం: మారుమూల గ్రామాల అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. యాస్పిరేషన్ బ్లాక్‌పై మహాముత్తారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం అధికారులతో బండి సంజయ్ సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఛాయా చిత్ర ప్రదర్శనను పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం చేయగా.. మంత్రి గర్భిణులకు చీర, గాజులు, స్వీట్లు అందజేశారు. అనంతరం సమావేశంలో మాట్లాడారు. మారుమూల మండలాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం యాస్పిరేషన్ బ్లాక్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, మంత్రి పీఎస్ వంశీ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

గోదావరికి హారతి

కాళేశ్వరం: కార్తీక మాసం సోమవారం సందర్భంగా కాళేశ్వరంలోని త్రివేణి సంగమ గోదావరికి గోదావరి హారతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం ప్రధాన రాజ గోపురం నుంచి మంగళ వాయిద్యాలతో గోదావరి నది వద్దకు వెళ్లారు. ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు గోదావరి నదికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఏ.మారుతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కామిడి శ్రీనివాసరెడ్డి, గ్రామస్తులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సహస్రదీపాలంకరణ..

దేవస్థానం అభిషేక మండపం వద్ద సామూహిక సహస్ర దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు, అధికారులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.



సామూహిక సహస్రదీపాలంకరణ

ఇంటర్ వర్సిటీ తైక్వాండో టోర్నమెంట్‌కు కేయూ జట్టు



టోర్నమెంట్‌కు ఎంపికైన మహిళా జట్టుతో వెంకయ్య

కేయూ క్యాంపస్: అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో ఈనెల 12 నుంచి 15వ తేదీవరకు జరగనున్న ఆల్ ఇండియా జోన్ ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య సోమవారం తెలిపారు. జి. శిరీష, ఎస్. తేజస్విని (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), కె. శ్రీవాణి (వాగ్దేవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్స్, వరంగల్), బి. రుద్ర (ఏకశిల డిగ్రీకాలేజీ, జనగామ), పి. నాగలక్ష్మి (ప్రభుత్వ డిగ్రీకాలేజి ,చెన్నూరు), సీహెచ్. తులసి (నలంద డిగ్రీ కాలేజీ, మహబూబాబాద్) ఉన్నారు.ఈ జట్టుకు కోచ్ అండ్ మేనేజర్‌గా మహబూబాబాద్ నలంద డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె. రమేశ్ వ్యవహరించనున్నారని స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య తెలిపారు.



ప్రపంచ పారా తైక్వాండో పోటీలకు గౌతమ్

వరంగల్ స్పోర్ట్స్ : బహ్రెయిన్‌లోని మైనామాలో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న ప్రపంచ సీనియర్ పారా తైక్వాండో పోటీలకు హనుమకొండలోని పైడిపల్లికి చెందిన ఎల్లావుల గౌతమ్‌యాదవ్ ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ పారా తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ దిలీప్‌కుమార్, జనరల్ సెక్రటరీ గణేశ్ యాదవ్ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో పంజాబ్‌లోని లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో నిర్వహించిన 3వ జాతీయ స్థాయి ఓపెన్ పారా తైక్వాండో చాంపియన్‌షిప్‌లో గౌతమ్‌యాదవ్ బంగారు పతకం సాధించారు. బీ-50 , పూంసే విభాగంలో గోల్డ్ సాధించిన గౌతమ్ ప్రపంచస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. భారత తైక్వాండో అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ వీణాకుమారి, హరియాణ రాష్ట్ర అధ్యక్షుడు వినోద్‌కుమార్ చేతుల మీదుగా గౌతమ్‌యాదవ్ బంగారు పతకం అందుకున్నారు.



బంగారు పతకం అందుకుంటున్న గౌతమ్‌యాదవ్

క్లుప్తంగా

రుద్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో కార్తీక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని రుద్రేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు గంగు మణికంఠశర్మ, అర్చకులు సందీప్‌శర్మ, ప్రణవ్ ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సామూహిక రుద్రాభిషేకాలు జరుపుకున్నారు. రాత్రి 8 గంటలకు మహా హారతి శోభాయమానంగా జరిగింది. భక్తులు నాగేంద్రస్వామి వద్ద జ్యోతులు వెలిగించారు.

అక్షర చిట్స్ ఎదుట బాధితుల ఆందోళన



కాజీపేట అర్బన్ : అక్షర చిట్స్ ఖమ్మం బ్రాంచ్ బాధితులు సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని అక్షర చిట్స్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఖమ్మం జిల్లాలోని ఆరు బ్రాంచ్‌ల్లో సుమారు రూ.2కోట్ల వరకు చెల్లింపులు చేయకపోవడం.. వాయిదాల మీద వాయిదాలు పెట్టడంతో విసిగివేసారిన వందమందికి పైగా బాధితులు నక్కలగుట్టలోని అక్షర కార్యాలయానికి చేరుకుని ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఘటనస్థలానికి చేరుకున్నారు. డబ్బులు చెల్లింపు యాజమాన్యంతో మాట్లాడుకుని తేల్చుకునే అంశమని ఆందోళనకారులకు నచ్చజెప్పి శాంతింపజేశారు. కాగా, నాలుగు గంటలపాటు ఆందోళన కొనసాగగా.. అక్షర యాజమాన్యం అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

మధ్యాహ్నంనుంచి కొనుగోళ్లు

దిగొచ్చిన అధికారులు.. చర్చలు సఫలం

- అన్ని జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లకు సై
- సీసీఐ ఆంక్షలతో తొలుత బంద్..
- చర్చల విజయవంతంతో మధ్యాహ్నం నుంచి ప్రారంభం..



సమాచారం లేక సీసీఐ కేంద్రానికి వచ్చిన లూజు పత్తి వాహనాలు

వరంగల్: పత్తి కొనుగోళ్లు షురూ అయ్యాయి. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఎల్-1, ఎల్-2, ఎల్-3 పద్ధతి అమలు చేస్తామంటూ విధించిన ఆంక్షలను నిరసిస్తూ రాష్ట్ర కాటన్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు వరంగల్ ఏనుమాముల మార్కెట్ కమిటీ పరిధిలోని మిల్లుల్లో సోమవారం ఉదయం పత్తి కొనుగోళ్లు నిలిచాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రంగంలోకి దిగి సీసీఐ ఉన్నతాధికారులు, కాటన్ అసోసియేషన్ నాయకులతో చర్చలు జరపగా సఫలమయ్యాయి. గతేడాది సీసీఐ జిన్నింగ్ మిల్లులకు బేల్ ఒక్కటికి రూ.1,345 చెల్లించింది. ఈ ఏడాది నిర్వహించిన టెండర్లలో జిన్నర్స్ రూ.1,495 కోట్ చేశారు. ధరలపై చర్చలు జరిపిన సీసీఐ అధికారులు గతేడాది ఎంత చెల్లించామో అంతే చెల్లిస్తామని చెప్పి చివరకు రూ.5 పెంచేందుకు ఒప్పుకోవడంతో మిల్లుల యజమానులు అంగీకరించారు. ఇప్పుడు కొన్ని ఎల్-1, ఎల్-2 పేరుతో కొన్ని కేంద్రాలను నడిపించడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతారనే చర్చ జరిగినట్లు తెలిసింది. చివరకు మార్కెట్‌ల పరిధిలోని అన్ని జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో రైతులు తమ ఇష్టం వచ్చిన మిల్లులో పత్తి అమ్ముకునేలా ప్రభుత్వ అధికారులు, సీసీఐ అధికారుల మధ్య అంగీకారం కుదిరినట్లు తెలిసింది. ఈ కేంద్రాల్లో సీసీఐ అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఆలస్యంగా కొనుగోళ్లు..



రాష్ట్ర కాటన్ అసోసియేషన్ పిలుపు మేరకు వరంగల్ మార్కెట్ పరిధిలోని అన్ని సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిచిపోయాయి. రెండు, మూడు రోజులుగా సోమవారం నుంచి పత్తి కొనుగోళ్లు బంద్ చేస్తామని వ్యాపారులు ప్రచారం చేయడంతో మార్కెట్‌కు రైతులు పెద్దగా సరుకు తీసుకురాలేదు. దీనివల్ల మార్కెట్‌లో రైతుల నుంచి ఎలాంటి ఇబ్బందులు జరగలేదు. కాగా, పత్తి కొనుగోళ్లు జరగడం లేదనే సమాచారం తెలియని కొందరు రైతులు మార్కెట్‌కు వచ్చారు. దీంతో కార్యదర్శి నిర్మల.. పత్తి కొనుగోళ్లు మధ్యాహ్నం వరకు ప్రారంభమవుతాయని హామీ ఇవ్వడంతో ఎలాంటి ఆందోళనలు జరగలేదు. చివరకు సీసీఐ, ప్రభుత్వం, కాటన్ అసోసియేషన్ల మధ్య చర్చలు సఫలం కావడంతో మధ్యాహ్నం ఒంటిగంటకు జెండా పాట పెట్టారు. ఈజెండా పాటలో క్వింటాల్ గరిష్ఠ ధర రూ.6,960 నిర్ణయం జరిగింది. అనంతరం జిన్నింగ్ మిల్లుల వద్ద కొనుగోళ్లు జరగడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

దిగుబడి తగ్గింది..



“ రెండు ఎకరాల్లో పత్తి వేశా. పెట్టుబడి రూ.40వేల వరకు అయ్యింది. అందులో రూ.30వేలు కూలీల ఖర్చు అయ్యింది. మొత్తం పత్తిని తీసుకొచ్చా. రెండు ఎకరాల్లో కేవలం 6.60 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సీసీఐకి అమ్మగా ధర క్వింటాల్‌కు రూ.6750 పడింది. పత్తి మొత్తం తీసివేశా. మొక్కజొన్న వేస్తా.

\- డి.బాలు, చెన్నారావుపేట మండలం

7,192 క్వింటాళ్ల పత్తి కొనుగోలు



కొనుగోళ్లు ఆలస్యమైనప్పటికీ ప్రైవేట్, సీసీఐ రైతుల నుంచి 7,192క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. వ్యాపారులు 2,524బస్తాల పత్తి(1,262 క్వింటాళ్లు), 24లూజ్ వెహికిల్స్‌లో 380 క్వింటాళ్లు.. మొత్తం 1,642 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. సీసీఐ పత్తి 184 వాహనాల్లో కొనుగోలు కేంద్రాలకు రాగా 5,550 క్వింటాళ్లు కొనుగోలు చేసింది.

\- పి.నిర్మల, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి, ఏనుమాముల

అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ఈటల

జనగామ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టి వారి సమస్యలు పరిష్కరించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జనగామ జిల్లా కేంద్రంలోని గ్రేయిన్ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు తెలుసుకుని మార్కెటింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన ప్యాడీ క్లీనింగ్ మిషన్లు లేవన్నారు. దీంతో రైతులు గంటకు రూ. వెయ్యి చెల్లించి ప్రైవేట్ ప్యాడీ క్లీనర్‌ను అద్దెకు తీసుకుని వడ్లను తూర్పార పడుతున్నారన్నారు. దీని వల్ల రైతులపై భారం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో కొత్త ప్యాడీ క్లీనింగ్ మిషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. దొడ్డు, సన్న వడ్లు తీసుకుని వచ్చిన రైతుల పంట లోడ్ అయ్యే వరకు చూడకుండా వచ్చిన ధాన్యం వచ్చినట్లే తరలించాలన్నారు. హమాలీ చార్జీలు ప్రభుత్వమే చెల్లించాలన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యల గురించి ప్రభుత్వం మిల్లర్లతో మాట్లాడిందని, సోమవారం నుంచి సీసీఐ కొనుగోళ్లు ప్రారంభమయ్యాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కేవీఎల్ఎన్ రెడ్డి, సౌడ రమేశ్, ఊడుగుల రమేశ్, కౌన్సిలర్ మహంకాళీ హరిశ్చంద్ర గుప్తా, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ..

- మద్యం బాటిళ్లు, ఇనుపరాడ్లతో దాడులు
- పలువురికి గాయాలు

హసన్‌పర్తి: కుటుంబ కలహాలు ఇరువర్గాల మధ్య గొడవ ఘర్షణకు దారి తీశాయి. కత్తులు, ఇనుప రాడ్లతో పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఈఘటనలో పలువురికి గాయాలయ్యాయి. దీంతో ఇరువర్గాలు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన శాలినికి ఇదే ప్రాంతానికి చెందిన బిల్లా రణధీర్‌తో 19 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొంతకాలం వీరి కాపురం సావ్యంగానే సాగింది. వీరికి కుమారుడు, కూతురులు ఉన్నారు. అయితే కొంతకాలంగా డబ్బుల కోసం రణధీర్ తన భార్యను వేధింపులకు గురిచేస్తూ వచ్చాడు. భర్త వేధింపులకు భరించలేక శాలిని సోమవారం ఉదయం తల్లిగారింటికి వచ్చింది. అత్తారింటికి వెళ్లిన భార్య తిరిగి రాకపోవడంతో రణధీర్ వెళ్లి శాలినిని ఇనుప రాడ్లతో కొట్టాడు. ఘర్షణను అడ్డుకోవడానికి యత్నించిన బావమరిది రాకేశ్, మామ శివాజీపై దాడికి పాల్పడ్డాడు. ఈక్రమంలో ఇరువర్గాల మద్యం బాటిళ్లు, ఇనుప రాడ్లతో దాడులకు దిగారు. ఈఘర్షణలో ఇరువర్గాలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఎంజీఎం: సీకేఎం ఆస్పత్రిని సందర్శిస్తున్న రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్



హన్మకొండ చౌరస్తా : కే షీట్లను పరిశీలిస్తున్న ఆర్‌వీ కర్ణన్

ప్రసవాల సంఖ్య పెంచాలి

- ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్
- వరంగల్ సీకేఎం ఆస్పత్రి తనిఖీ
- శానిటేషన్, సెక్యూరిటీ నిర్వహణపై అసంతృప్తి
- పాలనపై సమీక్ష నిర్వహించాలని డీఎంహెచ్‌ఓకు ఆదేశాలు



ఎంజీఎం: ప్రాంగణంలో మురుగునీరు

ఎంజీఎం : వరంగల్ సీకేఎం ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆస్పత్రిని సందర్శించి వైద్యసేవలతో పాటు, నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ ఆస్పత్రిలో అడుగుపెడుతూనే అధ్వానంగా ఉన్న శానిటేషన్ వ్యవస్థను గమనించారు. ఆస్పత్రిలో లేబర్, రూమ్, నవజాత శిశు సంరక్షణ కేంద్రాలను పరిశీలించిన అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ సెలవులో ఉండడంతో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌తో సమస్యలపై చర్చించారు. 10 మంది వైద్యులు ఉన్నచోట నెలకు వెయ్యి వరకు ప్రసవాలు అవుతున్న క్రమంలో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీజీలతో కలిపి మొత్తం 30 మంది వైద్యులు ఉన్న చోట ప్రసవాల సంఖ్య తక్కువ కావడానికి గల కారణాలేమిటని ప్రశ్నించారు. పేద ప్రజలు ప్రైవేట్‌కు వెళ్లకుండా ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్య సేవలు అందేలా సేవలందించాలని సూచించారు. ఆస్పత్రిలో సేవలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ సాంబశివరావును ఆదేశించారు.

శానిటేషన్, సెక్యూరిటీ నిర్వహణపై తీవ్ర అసంతృప్తి

ఆస్పత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహణపై కమిషనర్ కర్ణన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది వైఫల్యంలో సాంకేతిక కారణాలు ఉన్నాయని ఆర్ఎంఓలు కమిషనర్‌కు వివరించారు. ఇలాంటి సమస్యలు పునరావృత్తం కాకుండా ప్రణాళికాప్రకారం ముందుకు సాగి సమస్య పరిష్కరించాలని కమిషనర్ స్పష్టం చేశారు. కాగా, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం పూర్తిస్థాయిలో ఉన్న అతడికి శాఖాపరమైన మోమోలు ఇచ్చేందుకు పరిపాలనాధికారులు ఎందుకు జంకుతున్నారో అర్థం కావడం లేదు.

ఆస్పత్రిలో ఎక్కడ చూసినా ఎలుకలే..

సీకేఎంలో పారిశుద్ధ్యం పూర్తి స్థాయిలో లోపించింది. దీంతో ఆస్పత్రిలో ఎక్కడ చూసినా ఎలుకలే సంచరిస్తూ ప్రాంగణమంతా పూర్తిగా అధ్వానంగా మారింది. ఆస్పత్రికి వస్తే వైద్యసేవలు పొందడం దేవుడెరుగు.. లేని రోగులు వస్తాయమో అన్న చందంగా తయారైంది పరిస్థితి. ఆస్పత్రి పాలనపై జిల్లా మంత్రి కొండా సురేఖతో పాటు కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి సేవలు మెరుగుపరచాలని పలువురు రోగులు వేడుకుంటున్నారు.

జీఎంహెచ్‌ను తనిఖీ చేసిన ఆర్‌వీ కర్ణన్

హన్మకొండ చౌరస్తా: ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఇంకా ఎక్కువ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన వైద్య సేవలందించాలని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ వైద్యాధికారులను ఆదేశించారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని సోమవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో స్కానింగ్ సెంటర్ ను తనిఖీ చేసిన ఆయన రోజుకు ఎన్ని టిఫా స్కానింగ్, గైనిక్ స్కానింగ్‌లు చేస్తున్నారో రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు ఆ వివరాలను టీహబ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు కేషీట్‌లను, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య, సూపరింటెండెంట్ విజయలక్ష్మి, పీఓడీటీటీ లలితాదేవి, ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి, ఆర్ఎంఓ అంబరీశ్, పీఓఎంసీహెచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జనగామకు మరో గౌరవం..

- మలేషియా వేదికపై కూచిపూడి నృత్యం
- చిన్నారుల అద్భుత ప్రదర్శన




మలేషియా వేదికపై జనగామ చిన్నారులు, మాస్టర్ సుఖేశ్

జనగామ: జనగామకు దక్కిన మరో గౌరవం దక్కింది. మలేషియా గడ్డపై పేరిణి నృత్యంతో నలుగురు చిన్నారులు జనగామ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింప చేశారు. జనగామ జిల్లా కేంద్రంలోని మైత్రేయ కూచిపూడి కళాక్షేత్రం నృత్య మాస్టర్ పులిగిల్ల సుఖేశ్ ఆధ్వర్యంలో చిన్నారి కళాకారులు బి.వర్షిత, ఎస్.హరిప్రియ, బి.మనస్విక, బి.దీతిక.. మలేషియాలోని కౌలాలంపూర్ వేదికపై ఆదివారం రాత్రి కూచిపూడిలో అద్భుత ప్రదర్శన నిర్వహించారు. పాలకుర్తి కోదండరామశర్మ, తెలుగు మలేషియా అసోసియేషన్, పిరమిడ్ యోగా అండ్ డ్యాన్స్ అకాడమీ యూకే అసోసియేషన్ నిర్వహించిన దివాళీ కల్చరల్ ఫెస్టివల్ సంబురాల్లో పాల్గొని తెలుగువారి సంప్రదాయ కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


- మామునూరు చెరువు కట్ట వద్ద ఘటన
- రాయపర్తి మండలం జింకురాం తండాలో విషాదం



సురేశ్ (ఫైల్)

మామునూరు: డ్యూటీకి వెళ్లి వస్తానని భార్యకు చెప్పి బయలుదేరిన గంట వ్యవధిలోనే ఓ వ్యక్తిని మృత్యువు కబళించింది. జాతీయ రహదారిపై అర్ధరాత్రి ఎదురుగా వచ్చే వాహన లైటింగ్ ఫోకస్ కళ్లలో పడడంతో వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాదకర దుర్ఘటన ఆదివారం అర్ధరాత్రి మామునూరు చెరువుకట్ట వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం జింకురాం తండాకు చెందిన బాధవత్ నర్సింహ, భారతి దంపతుల కుమారుడు సురేశ్ (26)కు నాలుగేళ్ల క్రితం ఉషతో వివాహమైంది. వీరికి మూడేళ్ల కుమార్తె, 14 రోజుల బాబు ఉన్నారు. సురేశ్ హనుమకొండలో ఓ వ్యక్తి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బాలింత అయిన భార్య ఉష, మూడేళ్ల కుమార్తెను చూసేందుకు శనివారం రాత్రి డ్యూటీ నుంచి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఇద్దరు పిల్లలతో సంతోషంగా గడిపాడు. డ్యూటీకి వెళ్లి వస్తా బాబు జాగ్రత్త అంటూ భార్య ఉషకు చెప్పి రాత్రి 12 గంటలసమయంలో బైక్‌పై రాయపర్తి నుంచి హనుమకొండకు బయలుదేరాడు. మామునూరు శివారు చెరువు కట్ట వద్దకు చేరుకోగానే వరంగల్ వైపు నుంచి వచ్చే భారీ వాహనాల లైటింగ్ ఫోకస్ కళ్లలో పడడంతో బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జాగ్రత్తలు చెప్పి బయలుదేరిన గంట వ్యవధిలోనే ఇలా జరిగిందంటూ కుటుంబ సభ్యులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న మామునూరు ఎస్సై కృష్ణవేణి హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి బాధవత్ నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రమేశ్ సోమవారం తెలిపారు.

నెల్లుట్లలో మహిళ..



రాములమ్మ(ఫైల్)

లింగాలఘణపురం: మండలంలోని హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై నెల్లుట్ల -యశ్వంతాపూర్ మధ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శివరాత్రి రాములమ్మ(53) మృతి చెందింది. ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ కథనం ప్రకారం.. నెల్లుట్లకు చెందిన రాములమ్మ వ్యవసాయ బావి వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా కారు వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని, కారు డ్రైవర్ పరారీలో ఉన్నట్లు ఎస్సై వివరించారు.

‘బ్యాక్‌లాగ్’ ఎందుకు భర్తీ చేయడం లేదు?

- ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



విద్యార్థినులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులు ఎన్ని ఉన్నాయి? ఉంటే ఎందుకు భర్తీ చేయడం లేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ప్రశ్నించారు. ఈ అంశంపై రిజిస్ట్రార్ మల్లారెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారం రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.. సభ్యులు రామ్‌బాబునాయక్, రేసుకుంట్ల ప్రవీణ్ తదితరులతో కలిసి కాకతీయ యూనివర్సిటీకి విచ్చేశారు. ఈ సందర్భంగా కమిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ విషయంపై తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. హనుమకొండలోని యూనివర్సిటీ మహిళా కాలేజి ప్రిన్సిపాల్ మధుశ్రీ మాట్లాడుతూ కాలేజీలో విద్యార్థినులకు హాస్టల్ వసతిలేదని, కల్పించాల్సిన అవసరం ఉందని కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వీసీ ప్రతాప్‌రెడ్డి.. ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ రాజమణి, వివిధ యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు భిక్షాలు, సుదర్శన్, వరలక్ష్మి, అమరవేణి, సీడీసీ డీన్ రాంచంద్రం, అకడమిక్ ఆడిట్ డీన్ హనుమంతు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థినులతో మాట్లాడుతూ సమస్యలు తెలియజేయాలని కోరారు. దీంతో పలువురు విద్యార్థినులు తమ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే, కాకతీయ యూనివర్సిటీలోని ఎస్‌డీఎల్‌సీఈని సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల సంఖ్య పెంచి ఎస్‌డీఎల్‌సీని బలోపేతం చేయాలని డైరెక్టర్ రాంచంద్రానికి సూచించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మహిళా సాధికారత పెరగాలి

- ప్రముఖ న్యాయవాది జహాఆరా



స్మారకోపన్యాసం చేస్తున్న ప్రముఖ న్యాయవాది జహాఆరా

కేయూ క్యాంపస్: పోరాటాలతోనే మహిళలకు ఎన్నో నూతన చట్టాలు వచ్చాయని, అయితే పురుషాధిక్య సమాజంలో ఆ చట్టాలు సరిగా అమలుకు నోచుకోవడం లేదని విశాఖపట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది జహాఆరా అన్నారు. దివంగత మానవహక్కుల నేత కె.బాలగోపాల్ 14వ స్మారకపోన్యాసం సోమవారం కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం సెనేట్‌హాల్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ‘స్త్రీల హక్కులు ..రోల్ ఆఫ్ జ్యుడీషియరీ’ అనే అంశంపై జహాఆరా స్మారకోపన్యాసం చేశారు. హక్కుల కోసం పోరాడిన బాలగోపాల్ అందరివాడన్నారు. నేటి విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహిళల సాధికారత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా చట్టాలు దుర్వినియోగమవుతున్నాని, ఇంకా పురుషాధిక్యత కొనసాగుతోందన్నారు. లింగవివక్ష పోతేనే మహిళలకు రక్షణ అన్నారు. ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ జి. హరగోపాల్ మాట్లాడుతూ డాక్టర్ బాలగోపాల్ సామాజిక మార్పు కోసం వివిధ దృక్కోణాలతో పరిశీలించేవారన్నారు. అసమానత, అణచివేత, ప్రశ్నించేతత్వం ఒక ప్రగతిశీల ప్రజాస్వామ్య ఆలోచన అన్నారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, న్యాక్ పూర్వపు డైరెక్టర్ వీఎస్ ప్రసాద్, బాలగోపాల్ సతీమణి వసంతలక్ష్మి, పర్స్పెక్టివ్ సంస్థ సభ్యులు, విశ్రాంత ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ.. అనంతలోకాలకు

- బైక్ అదుపు తప్పి ద్విచక్రవాహనదారుడి మృతి



రాజిరెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

హసన్‌పర్తి : అంత్యక్రియలకు హాజరై తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా ఓ బైక్ అదుపు తప్పగా ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన హసన్‌పర్తి మండలంలోని ముచ్చర్ల సమీపం ఈదులచెరువు వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హసన్‌పర్తి మండలం సీతానాగారానికి చెందిన రేషన్ డీలర్ సూదుల మోహన్‌రెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఈ అంత్యక్రియలకు కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన మూల రాజిరెడ్డి (50) హాజరయ్యాడు. అంత్యక్రియలు ముగిసిన తర్వాత ద్విచక్రవాహనంపై సీతానాగారం నుంచి కడిపికొండకు బయలుదేరాడు. మార్గమధ్యలో ముచ్చర్ల సమీపంలో ఈదుల చెరువు వద్ద బైక్ అదుపు తప్పగా రాజిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.